విశాలాంధ్ర

వైయస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

ఆదివారం 31, ఆగస్టు -2025 4 పేజీలు

జిల్లాలో 11 ఓపెన్ బార్లు

విశాలాంధ్ర-రాయచోటి: ప్రభుత్వం నూతనంగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 11 ఓపెన్ బార్లకు, ఒక రిజర్వ్డ్ బార్‌కు లాటరీ ద్వారా కేటాయింపు జరిపినట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో బార్ల కేటాయింపు లాటరీ డ్రా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ మదనపల్లి డివిజన్‌లో మూడు బార్లు, రాయచోటిలో రెండు బార్లు, రాజంపేటలో రెండు బార్లు, కల్లుగీత కార్మికులకు ఒక రిజర్వ్డ్ బార్ సహా మొత్తం 11 ఓపెన్ బార్లకు, ఒక రిజర్వ్డ్ బార్‌కు లాటరీ ద్వారా కేటాయించామని వివరించారు. మదనపల్లిలో అంగజాల రాజన్న, బి.మనోహర్, బండారు నాగరాజులు, రాయచోటిలో దొండ్ల హర్ష వర్ధన్, పేరం ఇరగంరెడ్డి, రాజంపేటలో కె.సురేష్ కుమార్ నాయుడు, కె.సుబ్బయ్యలు, అలాగే కల్లుగీత కార్మికులకు రిజర్వ్డ్ బార్ కేటాయింపులో బి.కొత్తకోట బార్‌ను కుడుము ఆదిత్యకు లాటరీ డ్రా ద్వారా కేటాయించామని కలెక్టర్ తెలిపారు. మిగిలిన నాలుగు బార్లకు తగినన్ని దరఖాస్తులు రాకపోవడంతో లాటరీ నిర్వహించలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి. మధుసూదన్, ఏఇఎస్ జోగేంద్ర, సీఐలు ఎల్లయ్య, గురుప్రసాద్, భీమలింగ, సుబ్బారెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఎల్ డిఎంతో పాటు దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

కడపలో ఏపీ ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు విజయవంతం

విశాలాంధ్ర-కడప రూరల్ : ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి చేయాలని అఖిలభారత ఆశా వర్కర్ యూనియన్ జాతీయ కార్యదర్శి కే.మల్లిక కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు కడపలో నిర్వహించారు. కడప కోటిరెడ్డి సర్కిల్ నుండి వైయస్సార్ ఆడిటోరియం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు పి సుభాషిణి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా కే మల్లికా పాల్గొని ప్రసంగించారు. ఈ సభలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్. వెంకటసుబ్బయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ నాగ సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాహుల్. శాంతి, ఏఐటియు జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గంగాధర్, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరికె.సి బాదుల్లా, ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కల్పన,ఏఐటీయూసీ నాయకులు చాంద్ భాషా లింగన్న పిచ్చినేని సుబ్బరాయుడు, యు.మద్దిలేటి, బి.శాంతమ్మ,లక్ష్మీ నరసమ్మ, వరలక్ష్మి,అనిత, అనసూయ, సరళ, ప్రొద్దుటూరు శ్రీదేవి, కల్లూరు లలిత పాల్గొన్నారు.

(వివరాలు మెయిన్‌లో)

ఉల్లికి గిట్టుబాటు ధరలు కల్పించాలి :యూరియా కొరత నివారించాలి

తొలగించిన పెన్షన్లు పునరుద్ధరించాలి :జడ్పీ సర్వసభ్య సమావేశంలో వైసీపీ జడ్పీటీసీ సభ్యుల డిమాండ్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఉల్లికి గిట్టు బాటు ధరలు లభించక రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని, వెంటనే గిట్టుబాటు ధరలు కల్పించాలనీ, యూరియా కొరత నివారించాలనీ, కృత్రిమ కొరత సృష్టించి అధిక రేట్లకు విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని, పెన్షన్లు పునరుద్ధరించాలనీ పలువురు వై.సి.పి జడ్.పి.టి.సి సభ్యులు డిమాండ్ చేశారు. జడ్పీ కార్యాలయంలో చైర్మన్ ఏం రామగోవింద రెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అధితి సింగ్ సమావేశానికి హాజరు కాక పోవడం పట్ల పలువురు జడ్పీటీసీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి కలెక్టర్, జేసి రాకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని వారు తెలిపారు. ఇందుకు స్పందించిన జిల్లా పరిషత్ చైర్మన్ ఏం రామ గోవిందరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పలు సమావేశాల్లో పాల్గొనాల్సి ఉండడంతో ఆ సమావేశాలు ముగించుకొని వస్తారని సభ్యులకు సమాధానం ఇచ్చారు. సభ్యులు చర్చ కొనసాగిస్తుండగా, కలెక్టర్ 11.30 గంటలకు సమావేశానికి హాజరు అయ్యారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన వేంపల్లి, పోరుమామిళ్ల, పోరుమామిళ్ల బ్రహ్మంగారిమఠం, వీరపునాయునిపల్లి, చక్రాయపేట జెడ్పిటిసి సభ్యులు జిల్లా వ్యాప్తంగా నెలకొన్న సమస్యలపై అధికారులను నిలదీశారు. జిల్లాలో ఉల్లి రైతులు

గిట్టుబాటు ధర లభించక గిట్టుబాటు ధరలు లభించక తీవ్రంగా నష్టపోతున్నారని వారు తెలిపారు.ఉల్లి రైతులకు నిర్దిష్ట మద్దతు ధర ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రైతులు అప్పుల

2 లో

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి
జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

విశాలాంధ్ర -రాజంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 1న రాజంపేట మండలం బోయనపల్లి గ్రామంలో పాల్గొననున్న పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. శనివారం కలెక్టర్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, సబ్ కలెక్టర్ భావన, అదనపు ఎస్పీ మనోజ్ రెడ్డి లతో కలిసి హెలిప్యాడ్, దోబీ ఘాట్, పింఛన్ లబ్ధిదారుల ఇండ్లు, ప్రజా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా అప్పగించిన బాధ్యతలను పూర్తి చేసి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. బోయనపల్లి గ్రామ సమీపంలో సిద్ధం చేసిన హెలిప్యాడ్ మైదానంలో చుట్టూ బ్యారికేడింగ్ పనులు పూర్తి చేసి, వాటర్ స్ప్రింక్లింగ్ నిర్వహించాల్సిందిగా ఆర్ అండ్ బి, అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. కాన్వాయ్ వెంట సక్రమ స్థితిలో వాహనాలను ఏర్పాటు చేయాలని రవాణా అధికారులకు సూచించారు. హెలిప్యాడ్ సమీపంలో మెడికల్ క్యాంప్, అంబులెన్స్, కార్డియాలజిస్ట్‌తో పాటు నైపుణ్యం గల వైద్యులను సిద్ధంగా ఉంచాలని డీఎం %డ% హెచ్‌ఓ, డిసిహెచ్ఎస్ మరియు సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ప్రోటోకాల్ ప్రకారం ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు.అనంతరం ధోబిఘాట్ ను పరిశీలించి ముఖ్యమంత్రి ముఖాముఖి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ పంపిణీ చేసే లబ్ధిదారుల వివరాలను కూడా కలెక్టర్ పరిశీలిస్తూ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని డిపిఓను ఆదేశించగా, విద్యుత్ సరఫరా నిరంతరంగా అందించేందుకు ఏపీఎస్పిడిసిఎల్ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రజావేదికను పరిశీలిస్తూ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులను వెంటాడుతున్న కష్టాలు: వైసిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర-చెన్నూరు : కూటమి ప్రభుత్వంలో ఉల్లి రైతులు కుదేలయ్యారు. అధిక వర్షాలు, వరదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం కమలాపురం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉల్లి రైతులు ఈ సమయంలో తీవ్రంగా ఇబ్బందుల పాలవుతున్నారు. వరదలు, భారీ వర్షాలు, మరియు వాతావరణ మార్పులు రైతుల పరిస్థితిని మరింత దిగజార్చాయి. ఉల్లి పంట ధరలు కూడా దళారుల చేతుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు తమ ఉల్లిని తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోంది. ఆయన కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. "ప్రస్తుతం ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. గతంలో ఈ విధమైన ఇబ్బందులు రైతులు ఎదుర్కోలేదు. ప్రభుత్వం ఈ విషయంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఇది అని అన్నారు.రైతుల సంక్షోభంపై ఇంకా ఈ సంవత్సరం ఉల్లి ధరలు మళ్లీ 13వేల పైకి చేరలేదు. ప్రభుత్వం రైతులకు అవసరమైన మద్దతు అందించలేదు. యూరియా, ఇతర పంట రసాయనాలు కూడా రైతులకు అందక రైతులు

2 లో

యూరియా కొరత నివారించాలి

(మొదటి పేజీ తరువాయి)
పాలు కావాల్సివస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎరువుల కొరత తీవ్రంగా ఉందని డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి అధిక రేట్లకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఇందుకు స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత రాకుండా చర్యలు చేపట్టామని, కావాల్సినన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులకు అవసరమైన అన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. డీలర్లు అధికరేట్లకు ఎరువులు విక్రయిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సభ్యులకు తెలియజేశారు. ఫిర్యాదుల మేరకు డీలర్ షాపులపై విజిలెన్స్ అధికారులు, పోలీసులచే దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. చక్రాయపేట మండలంలో వర్షాలకు మామిడి పంట తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు నష్టపోయారని వారిని ఆదుకోవాలని కోరారు వారిని ఆదుకోవాలని కోరారు. వారికి ఇన్సూరెన్స్ పరిహారం కూడా అందలేదన్నారు. ఇష్టానుసారంగా పెన్షన్ తొలగిస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని పలువురు జడ్పిటిసి సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ అర్హుల పెన్షన్లు తొలగించే ప్రసక్తే లేదని, అలా తొలగించిన వారు అర్హులు అయితే తిరిగి కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు సి ఆదినారాయణ రెడ్డి, పి చైతన్య రెడ్డి, ఏ అమర్నాథరెడ్డి, ఎన్. వరదరాజులు రెడ్డి, ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొని రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు.

ఉల్లి రైతులను వెంటాడుతున్న కష్టాలు: వైసిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)
తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కమలాపురంలో వైఎస్ఆర్సిపి నాయకులు గంగాధర్ రెడ్డి సతీమణి, 15వ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణమ్మను, అలాగే వైసీపీ నాయకురాలు సావిత్రమ్మను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో, ఇటీవల మరణించిన రామసుబ్బారెడ్డి కుటుంబాన్ని కూడా పి. రవీంద్రనాథ్ రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉత్తమ రెడ్డి వైసిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నేతలకు ఘన సత్కారం

ఘనంగా స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు

విశాలాంధ్ర- సిద్ధవటం : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సిద్ధవటం మండలంలోని నేకనాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీ నివాసులు వినాయక చవితి వేడుకల్లో భాగంగా టిడిపి నేతలకు డప్పు వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టిడిపి నేత రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వినాయక చవితి ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరూ వేడుకలు జరుపుకునే విధంగా కొన్ని ఆంక్షలు తొలగింపు చేసి పండగ జరుపుకునే విధంగా గణేష్ ఉత్సవాల మంట పాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందని గ్రామంలో రామాలయ గుడి నిర్మాణం పూర్తి చేస్తామని మా కూటమి ప్రభుత్వంలో ప్రతి నిరుపేదకు అన్ని విధాలుగా ఆదుకుంటామని ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ప్రతి ఒక్కటి అమలు అవుతున్నాయిని గ్రామాల్లో త్వరలో సీసీ రోడ్ల పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి, అన్నమయ్య జిల్లా టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షులు పుత్త రామచంద్రయ్య, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ నాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలి

ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ని కలిసిన అధ్యాపకుల సంఘం

విశాలాంధ్ర-కడప రూరల్ : ఆంధ్రప్రదేశ్ జూనియర్ లెక్చరర్లకు డిగ్రీ లెక్చరర్లగా పదోన్నతులు 75% ప్రమోషన్ కోటా అమలు చేయాలని శనివారం స్థానిక జిల్లా పరిషత్తు సభా భవన్లో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి జూనియర్ కళాశాల అధ్యాపకులు గోవిందరెడ్డి, శ్రీనివాసులు, విజయ్ కోల్, భాగ్యలక్ష్మమ్మ, సంపూర్ణ, స్వరూపా లు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జేఎల్ నుండి డీఎల్ ప్రమోషన్ యాక్సిడెంట్ లెక్చరర్ల సంఘం సభ్యులము. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో జూనియర్ లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్నాము అన్నారు. జి.ఓ.ఎం.ఎస్. నం.47 ప్రకారం, డిగ్రీ లెక్చరర్ ఖాళీలు 75% పదోన్నతుల ద్వారా జూనియర్ లెక్చరర్ల నుంచి భర్తీ చేయబడవలని ఉండగా, మిగిలిన 25% డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయబడవలసి ఉంది. 2012 నుంచి నేటివరకూ ప్రభుత్వం నాలుగు సార్లు ఏపీపీఎస్సీడైరెక్ట్ రిక్రూట్మెంట్ నోటిఫికేషన్లు జారీ చేసి 25% కోటా భర్తీ చేసింది. కానీ గత 12 సంవత్సరాలుగా ఒక్క జేఎల్ పదోన్నతిని కూడా డీఎల్గా మంజూరు చేయలేదు. దీని వలన వందలాది అర్హులైన జూనియర్ లెక్చరర్లు అన్యాయానికి గురవుతున్నారు. ఇటీవలి కాలంలో మధ్యవిద్యా శాఖ 590 మంది అర్హులైన జూనియర్ లెక్చరర్ల సీనియారిటీ జాబితాను వివిధ విషయాలలో తయారు చేసింది. వీరందరూ 55% పీజీ అర్హతతో పాటు యుజీసీ సర్టిఫికేట్ కలిగి ఉన్నవారే. అందులో చాలా మంది 10-15 సంవత్సరాల బోధనా అనుభవంతో, ప్రొబేషన్ కూడా విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. అదేవిధంగా, గౌరవ ప్రధాన కార్యదర్శి 28.10.2024 న జారీ చేసిన మెమో (సూచన-4) ప్రకారం, అర్హులైన జూనియర్ లెక్చరర్ల సీనియారిటీ జాబితాను తక్షణమే కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ గారికి పంపి, డీపీసీ సమావేశమై పదోన్నతులను కల్పించవలసిందిగా ఆదేశాలు జారీచేశారు. కానీ, ఈ ప్రక్రియ చాలా ఆలస్యం అవుతూ ఉంది. దాంతో మేము చాలా కాలంగా ఎదురుచూస్తున్న ప్రమోషన్లు నిలిచిపోతున్నాయి. అందువల్ల, మీ గౌరవ హస్తక్షేపంతో సంబంధిత శాఖలను ఆదేశించి, అర్హులైన జూనియర్ లెక్చరర్ల సీనియారిటీ జాబితా సహా అవసం మైన ప్రతిపాదనలు వెంటనే కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కార్యాలయానికి పంపించి, 75% కోటా ప్రమోషన్లను వేగవం తంగా అమలు చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. గత 12 సంవత్స రాలుగా పెండింగ్లో ఉన్న డిగ్రీ లెక్చరర్ పదోన్నతులు కల్పించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకొని పోవాలని కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించి మంత్రితో కల్పించే అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు.

జనసేనాని.. ఆ కుటుంబానికి అండగా నిలిచేనా.!

బ్రెయిన్ స్ట్రోక్ తో జనసేన ఇంచార్జ్ మృతి
కార్యకర్త నుండి నియోజకవర్గ స్థాయికి రమేష్
ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకోలు

(కెడీపీ పోటో 20, 21)

విశాలాంధ్ర- బద్వేల్ : 2014లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్థాపించిన పార్టీలో కార్యకర్త నుండి నియోజకవర్గ ఇన్చార్జి వరకు పార్టీలో ఆయన చేసిన సేవలు అభినందనీయమని చెప్పడంలో సందేహం లేదు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గంలో తనదైన శైలిలో పార్టీని బలోపేతం చేసేందుకు ఒక సైనికుడిగా పనిచేసిన ఆయన అకస్మాత్తుగా మృతి చెందడంతో జన సైనికులకు తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే బద్వేల్ నియోజకవర్గ జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ బసవి రమేష్ వయస్సు(34) బ్రెయిన్ స్ట్రోక్ తో శనివారం కడప నగరం రిమ్స్ లో మరణించారు. ఈనెల 26వ తేదీన బ్రెయిన్ స్ట్రోక్ రాగా ఆయనను అత్యవసరంగా హైదరాబాదులోని కిమ్స్ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఇక ఉపయోగం లేదన్న ఆస్పత్రి వర్గాలు హైదరాబాదు నుండి కడప రిమ్స్ కు తీసుకురాగా రిమ్స్ లో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం 4 గంటలకు మృతి చెందారు. బసవి రమేష్ మృతదేహాన్ని బద్వేల్ పట్టణంలోని సిద్ధవటం రోడ్డు శ్రీకృష్ణదేవరాయ నగర్ లోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చి ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు వారి కుటుంబీకులు తెలియజేశారు. చిన్న వయసులోనే కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడం బాధాకరమని బసవి రమేష్ మృతి పట్ల బద్వేల్ నియోజకవర్గం లోని జనసైనికులు, కూటమి నాయకులు సంతాపం తెలిపారు. పవన్ కళ్యాణ్ అంటే ఎనలేని అభిమానం.. ఆ అభిమానంతో పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలో చురుగ్గా పాల్గొనేవారు. జనసేన కార్యకర్త నుండి నియోజకవర్గ ఇన్చార్జి వరకు అంచలంచెలుగా ఎదిగి ఇంతలోనే చిన్న వయసులోనే మృతి చెందడం జనసేన కార్యకర్తలు కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. జనసేన పార్టీ తరపున జనసేన అధినేత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారి కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం పనిచేసిన రమేష్ కుటుంబానికి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ తరపున వారి కుటుంబానికి ఎంతవరకు సహాయ సహకారాలు అందిస్తారో వేచి చూడాల్సిందే.

అలరించిన ముగ్గుల పోటీలు : మొదటి బహుమతి కవిత కైవసం

విశాలాంధ్ర -నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి లోని జూనియర్ సివిల్ కోర్టు వద్ద ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 32 వ వార్షికోత్సవం సందర్భంగా వినాయకుని విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన రంగవల్లుల పోటీలు అలరించాయి. ఈ పోటీలలో కవిత ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని ప్రెజర్ కుక్కర్ ని, ఎంబలూరు కళ్యాణి ద్వితీయ స్థానంలో నిలిచి హాట్ బాక్స్, నారాయణమ్మ తృతీయ స్థానంతో వాటర్ ప్యూరిఫైడ్ ను కైవసం చేసుకున్నారు. పోటీలలో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. న్యాయ నిర్ణయితలుగా డాక్టర్ శ్రీ వాణి, వైఎస్ఆర్సిపి మహిళా మండల అధ్యక్షురాలు పల్లె మాధవిలు వ్యవహరించారు. ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, వల్లకొండు శివకుమార్,మేడ వెంకట కుమార్, గీత, కృష్ణ, నారాయణ, గండికోట శివకుమార్, మురళి, నారాయణ శెట్టి, సుమ, జ్యోతి, లక్ష్మి, పద్మజ, అఖిల, విజయ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార గ్రామీణ నీటి పారుదల సంస్థ :: అన్నమయ్య విభాగము
కార్య నిర్వహక ఇంజనీరు వారి కార్యాలయము

Tender Notice No: 02/EE/RIC/Annamayya/2025-26 తేది: 30.08.2025

షార్ట్ టెండర్ ప్రకటన

అన్నమయ్య జిల్లా యందు 51.00 లక్షల అంచనా విలువ గల వివిధ గ్రాంట్స్ క్రింద మంజూరు అయిన 04 పనుల కొరకు సీలు వేసిన టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ షెడ్యూల్ దరఖాస్తు చివరి తేది 06.09.2025. టెండర్ స్వీకరణకు చివరి తేది 12.09.2025 మ. 3.30 గంటల వరకు.
మిగతా వివరములకు కార్యాలయ పనివేళ యందు సంప్రదించవలసినదిగా కోరడమైనది.

కార్య నిర్వహక ఇంజనీర్

జీవిత సత్యాన్ని ప్రతిబింబించే ఘట్టం 'నిమజ్జనం'

విశాలాంధ్ర-పులివెందుల: వినాయక చవితి వేడుకల కార్యక్రమంలో భాగంగా జీవిత సత్యాన్ని ప్రతిబింబించే ఘట్టం నిమజ్జనం అంటారు. వినాయక చవితి పర్వదినం ప్రతి ఇంటి నుంచీ, ప్రతి వీధి నుంచీ వినిపించే ఆనందోత్సాహం. భక్తులు గణపతి బప్పను మట్టితో చేసిన విగ్రహ రూపంలో ఆహ్వానించి పూజలు చేస్తారు. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు మొత్తం కలిసి భక్తి స్ఫూర్తితో పండుగను జరుపుకుంటారు. గణేశుడు "విఘ్ననాయకుడు, బుద్ధి ప్రదాత, శుభారంభాల కర్త" అన్న విశ్వాసంతో ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కానీ పండుగ ముగిసిన తరువాత జరిగే గణేష్ నిమజ్జనం అనేది కేవలం ఉత్సవ ముగింపు కాదు, ఆచారంలో ఆధ్యాత్మికతను, జీవన సత్యాన్ని ప్రతిబింబించే ఘట్టం.

ఆధ్యాత్మిక అర్థం :
నిమజ్జనం అంటే మట్టితో చేసిన విగ్రహాన్ని తిరిగి ప్రకృతిలో కలపడం. ఇది సృష్టి-లయం తత్త్వానికి సంకేతం. "యదా ఆగమనం తథా గమనం" అన్న సత్యాన్ని గుర్తు చేస్తుంది. జననమూ లయమూ అనివార్యాలు, మనిషి కూడా ఒక రోజు పరమాత్మలో కలవాలి అన్న భావాన్ని ఈ ఆచారం భక్తులకు తెలియజేస్తుంది. అదేవిధంగా, విగ్రహ నిమజ్జనం విరక్తి, త్యాగం అనే భావనలను ప్రతిబింబిస్తుంది. గణపతిని ఇంటికి ఆహ్వానించినట్టే, పూజలు చేసి సత్కరించినట్టే, సమయానుకూలంగా వీడ్కోలు పలకడం కూడా జీవన ధర్మమే అన్న సూత్రాన్ని మనం అర్థం చేసుకోవాలి.
భక్తి కోణం :
భక్తులు నిమజ్జనం రోజున ఉత్సాహంతో గణపతి బప్పను వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్తారు. వాయిద్యాలు, జయఘోషలు, నృత్యాలు%ఖశ్రీశ్రీ% కలిపి ఆ వాతావరణం ఉత్సాహభరితంగా మారుతుంది. "గణపతి బప్పా మోరియాపుఢ్చ్యా వర్షీ లవ్కర్యా" అని నినదిస్తూ భక్తులు ఆయన మళ్లీ వచ్చే ఏడాది రావాలని ప్రార్థిస్తారు. ఇది భక్తుల విశ్వాసాన్ని, ఆనందాన్ని, సమాజంలోని ఐక్యతను తెలియజేస్తుంది.
సామాజిక సందేశం :
గణేష్ నిమజ్జనం సమాజంలో ఐక్యతను పెంచుతుంది. ప్రజలు కుల, మత, వర్గ భేదాలు మరిచి ఒకే ఉత్సవంలో కలిసిపోతారు. ఇది సామాజిక ఐకమత్యానికి చిహ్నం. ఇక శాస్త్రీయ దృక్కోణంలో మట్టితో చేసిన విగ్రహాలను నీటిలో కలపడం ద్వారా ప్రకృతితో మమేకం కావడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం కూడా జరుగుతుంది. గణేష్ నిమజ్జనం అనేది కేవలం ఉత్సవానికి ముగింపు కాదని, అది జీవన తాత్త్వికతకు ప్రతీక, భక్తికి ప్రతిబింబం, ఐక్యతకు చిహ్నం అని చెప్పాలి. గణపతి ఆశీస్సులతో ప్రతి ఇంటిలో సుఖశాంతులు, సమృద్ధి నిలవాలని భక్తులు ప్రార్థిస్తారు.

నిత్యం ప్రజా కార్యక్రమాల్లో డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర -అట్లూరు: నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా అవసరాలు తెలుసుకుని పరిష్కరానికి కృషి చేయడం తన పనిగా భావిస్తున్న ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి బద్వేల్ పట్టణం ఎన్జీవో కాలనీ మెయిన్ రోడ్డు వద్ద కొలువుదీరిన వినాయక మండపాలను సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పట్టణంలో ఏ వీధికి వెళ్లిన వినాయక మండపాలు దర్శనమిస్తున్నాయి. రాములు వారి గుడి వద్ద, బద్వేల్ పట్టణంలో పలు కాలనీలలో వినాయక మండప నిర్వాకుల ఆహ్వానం మేరకు మంచూరు సూర్యనారాయణ రెడ్డి తన అనుచర వర్గంతో వెళ్లి మండపాలను సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మున్సిపల్ కమీషనర్ నరసింహారెడ్డి, డ్రామా ఆర్టిస్ట్ డివి సుబ్బారావు మనమడు, అట్లూరు మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి, ఉపత్తి రామకృష్ణారెడ్డి, జయన్న, గాజులపల్లి శంకర్ రెడ్డి, లక్ష్మీ విద్యారణ్య అధినేత శంకర్ రెడ్డి, రఘురామిరెడ్డి తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నందీశ్వరాలయం నిర్మించడం హర్షణీయం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి మండలం నంది పల్లె గ్రామంలో గ్రామ సర్పంచ్, నందీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నందీశ్వరాలయం నిర్మించడం హర్షణీయమని మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి ప్రశంసించారు. సుమారు మూడున్నర కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సర్వాంగ సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. ఈ ఆలయంలో ప్రశాంతమైన వాతావరణం ఆధ్యాత్మికం కలిగి ఉండాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామాంజనేయరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీరామిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, గంగిరెడ్డి, రామలింగేశ్వర రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమర్, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లిహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న రాచమల్లు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: హైదరాబాద్ లోని జూబ్లిహిల్స్ పెద్దమ్మ తల్లిని శనివారం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిడ్నాప్, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి :సిపిఐ, డిహెచ్‌పిఎస్ డిమాండ్

విశాలాంధ్ర-మదనపల్లె: భూమి తమకు దక్కదనే ఆక్రోశంతో తమ దాయాదులపై విచక్షణ రహితంగాదాడి చేసి మా^నాయుధాలతో హత్యాయత్నానికి పాల్పడిన ములకలచెరువు మండలం బురకాయలకోటకు చెందిన భాస్కర్ గంగాద్రి ఆదిలక్ష్మి భవానీ ప్రసాద్ తదితరులపై కిడ్నాప్, హత్యాయత్నం కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని భారత సిపిఐ అన్నమయ్య జిల్లా సహాయ కార్యదర్శి తోపు కృష్ణప్ప, మదన పల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్ కుమార్‌లు డిమాండ్ చేశారు. మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కంటి రామచంద్ర మంచాల భారతీయుడు మంచాల హరి కుమారులను పరామర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ కురబలకోట మండలం ముదివేడు గ్రామ పొలం సర్వేనెంబర్ 401/2,401/5, 1601/2%ఖ%, 183/1,255/2 లలో మొత్తం ఎనిమిది ఎక రాల 26 సెంట్లు భూమి కంటి రెడ్డమ్మ మరియు లేట్ కంటి వెంకటరమణ ల పేర్ల మీద ఉండగా, వీరి దాయాదులైన కంటి శాంతప్ప కంటి సంజీవ కంటి వెంకటరమణ కంటి రామకృష్ణ కంటి కృష్ణప్ప కంటి భాస్కర్ కంటి గంగాద్రి తదితరులు ఈ భూమిలో వాటా ఉందని నిరంతరం గొడవలు పడటం దాడికి పాల్పడడం చేస్తుండే వారిని తెలిపారు. ఇప్పటి వరకు ఐదు సార్లు దాడికి పాల్పడి, చంపే ప్రయత్నం చేసిన నిందితులపై కిడ్నాప్ హత్యాయత్నం కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్ ఓపెన్ చేసి బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బాధితుల బంధువులు పాల్గొన్నారు.

ఎర్రబల్లె చెరువుకు నీరందించడమే లక్ష్యం: జెడ్పీటీసీ లతారెడ్డి

విశాలాంధ్ర- పులివెందుల: పులివెందుల మండలం ఎర్రబల్లె చెరువుకు నీరందించడమే తమ లక్ష్యమని పులివెందుల జెడ్పీ టీసీ మారెడ్డి లతారెడ్డి అన్నారు. జెడ్పీటీసీగా కడపలో శని వారం ఆమె ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా లతారెడ్డి మాట్లాడుతూ ఎర్రబల్లె చెరువుకు నీరందించే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవిల సహ కారంతో జీవో తీసుకొస్తామన్నారు. ఈ విషయాన్ని తాను జెడ్పీ సమావేశంలో ప్రస్తావించానని తెలిపారు. అధికారులు కూడా జీవో ప్రాసెస్‌లో ఉందని, తప్పక వస్తుందని చెప్పినట్లు లతారెడ్డి వెల్లడించారు త్వరలో ఎర్రబల్లె చెరువుకు నీరు వస్తుందని, రైతుల కలలు సాకారమవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

మదనపల్లి, పుంగనూరు నియోజకవర్గాలకు హంద్రీనీవా నీరివ్వాలి :సిపిఐ

విశాలాంధ్ర-మదనపల్లె:హంద్రీనీవా నీటిని మదనపల్లి పుంగనూరు నియోజకవర్గాలకు సాగునీరు,తాగునీరు అందించాలని సిపిఐ నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయలసీమ జిల్లాలకు 6 లక్షల 25 వేల ఎకరాలకు సాగునీరు, 10 లక్షల మందికి తాగునీరు ఇస్తామని "మహానుభావుడు రామారావు గారు " ఈ ప్రాజెక్టును ప్రారంభించారని, నేడు హంద్రీనీవా నీటిని కుప్పానికి తీసుకెళ్ళి జలహారతి కార్యక్రమం ఏర్పాటు చేయడం,అందులో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనడాన్ని సిపిఐ గా స్వాగతిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో పత్రికలో వార్త ఒకటి ప్రచురితమైందని,అందులో మదనపల్లి, పుంగనూరు నియోజకవర్గాల్లో ఏ ఒక్క చెరువుకు గాని, ఏ ఒక్క సమ్మర్ స్టోరేజ్ కు గాని హంద్రీనీవా నీరు ఇస్తున్నట్టు పొందుపరచలేదని అన్నారు. మదనపల్లి నియోజకవర్గ ప్రజలకు తాగునీరు సాగునీరు ఇవ్వకపోతే సిపిఐ గా ప్రజానికాన్ని, రైతాంగాన్ని కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మదనపల్లి పట్టణ కార్యదర్శి మాధవ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుధీర్, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంతో మంది పేదల ప్రాణాలను కాపాడుతున్నాం: భూమిరెడ్డి ఉమాదేవి

విశాలాంధ్ర-పులివెందుల: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మంది పేదల ప్రాణాలను కాపాడుతున్నామని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి పేర్కొన్నారు. శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు పులివెందుల పట్టణంలో ఆమె స్వగృహంలో శని వారం నియోజకవర్గంలో దాదాపు 20 మంది లబ్ధిదారులకు రూ.16,67,281లు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసుల రెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి జ్ఞానేశ్వర్ నాయుడు, ముచ్చుమర్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలరెడ్డి సేవలు చిరస్మరణీయం: ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: కంభం తిరుమలరెడ్డి సేవలు చిరస్మరణీయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కొనియాడారు. పులివెందుల పట్టణంలో వీరపునాయునిపల్లె మండలం మొయిల్లచెరువు గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి, ఆయన సతీమణి రామలక్షుమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శంకర నేత్రాలయ సహకారంతో బాకరాపురం జయమ్మకాలనీలో సుమారు పదిరోజుల పాటు ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ఉచితముగా కంటి పొర ఆపరేషన్లు నిర్వహించడము అభినందనీయమన్నారు. ఈ సదవకాశాన్ని పులివెందుల నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని, కంటి పరీక్షలతో పాటు కంటి అద్దాలు మందులు అన్ని ఉచితంగా ఇవ్వడం గొప్ప విశేషమన్నారు. భవిష్యత్తులో తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులు మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి మన్ననలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, తిరుమల రెడ్డి స్నేహ బృందం,వ ానవతా సభ్యులు, నేత్రాలయా సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఖుబా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో నేడు ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు మస్జిద్ ఆవరణంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మెన్ వై.ఎస్ జబీవుల్లా హాజరౌతారని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ వీ.సి లోకేష్‌కుమార్, డా.టి.శృతి, డా.పి. జయలక్ష్మి, డా.టీ.శ్రీకాంత్, డా.ఎం.శ్రవన కుమార్‌లు హాజరౌతారన్నారు. కావున పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రిమ్స్‌గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ పదవీ విరమణ వీడ్కోలు..

విశాలాంధ్ర-కడప : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో గత ఏడాది నుంచి గ్రేడ్ 2 నర్సింగ్ సూపర్డెంట్ గా పనిచేస్తున్న జి. ఇందిరమ్మ ఆగస్టు నెలాఖరున పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలో ఇందిరమ్మను, భర్తతో కలిపి శనివారం కడప రిమ్స్ ఐపి భాగంలో లెక్చర్ గ్యాలరీలో ఇరువురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, హెడ్ సిస్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.50 వేలు పలికిన గణేశుని లడ్డు

విశాలాంధ్ర - నందలూరు: మండలంలోని టివిపురంలో వైఎస్ఆర్సిపి బీసీ విభాగం రాజంపేట నియోజకవర్గ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద 5 కేజీల లడ్డుని వేలంపాటలో 50 వేల రూపాయలకి గోగుల శ్రీనివాసులు దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో వై. వెంకటసుబ్బయ్య, నారాయణ,భాస్కర్ రాజు, మల్లికార్జున రాజు, ఎం.శివ, చందు, సుబ్బు, వాసు, సుబ్బరాయుడు, కోటి, కిరణ్, కళ్యాణ్, భరత్, సిద్దయ్య, రమణయ్య, పాల్గొన్నారు.

సాహస పథకాల సంక్షేమ సారధి చంద్రబాబు : నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర- పీలేరు :ఎన్నికల ముందు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ కావడంతో దేశంలోనే సాహస పథకాల సంక్షేమ సారధిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలిచారని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా : పీలేరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో స్త్రీ శక్తి విజయోత్సవ సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు నాయకులు కార్యకర్తలు అభిమానులు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాల్లో ఎన్టీఆర్ భరోసా, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, రైతులకు అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ

బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం,ఐదు పథకాలు అమలు చేసి రాష్ట్రంలో సంచలనం సృష్టించారని అన్నారు.స్త్రీ శక్తి పథకంతో వివిధ రకాల ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలో మహిళలు ఎక్కడికైనా ప్రయాణం చేసే వెసులుబాటు కల్పించి మహిళలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆయన అన్నారు. రాజకీయం చేయడం అంటే పెత్తనం చలాయించడం కాదని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని నియోజవర్గ ప్రజలు కోసం, అభివృద్ధి కోసం వినియోగించాలని, ప్రజలకు సేవలు చేయడమే నిజమైన రాజకీయమని సూచించారు.నల్లారి కుటుంబం అమర్నాథరెడ్డి కాలం నుండి కూడా ముఖ్యమంత్రి పదవితో పాటు అన్ని పదవులు అనుభవించామని తమ స్వార్థం కోసమో స్వలాభం కోసమో లగ్జరీ జీవితం కోసమో ఏనాడు పని చేయలేదని నియోజవర్గ అభివృద్ధి కార్యకర్తల సంక్షేమం ప్రజల కోసమే పాటు పడ్డామని గుర్తు చేశారు.పి 4 సర్వే తో పేదరికం లేని సమాజంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే పేదలను గుర్తించి వారిని దత్తకు తీసుకునే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు ముందుకెళుతున్నారని అన్నారు.స్త్రీ శక్తి విజయోత్సవ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా అంచనాలకు మించి మహిళలు, ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అభిమానులు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నల్లారి స్వయంగా మహిళలకు వారు కూర్చున్న చోటికి వెళ్లి అందరికి అభివాదం తెలిపారు.

రైతుల సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు:రాజుపాళెం మండలంలోని పర్లపాడు గ్రామ రైతుల 150ఎకరాల భూమి ఎండోమెంట్‌లో ఉన్న కారణంగా ఆ సమస్యను రైతులు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో మాట్లాడి పర్లపాడు గ్రామ రైతుల భూమిని ఎండోమెంట్ నుంచి తొలగించి రైతుల సమస్యను పరిష్కరించారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి కృషితో సమస్య పరిష్కారం అయినందున ఆ రైతులు శనివారం కామనూరులోని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టండి-అదనపు జిల్లా జడ్జి ఏ.మహేష్

విశాలాంధ్ర- పీలేరు : బాల్య వివాహాలను అరికట్టాలని పదకొండవ అదనపు జిల్లా జడ్జి, చేర్మెన్ ఏ మహేష్ అన్నారు. పీలేరు మండలంలోని మరి మాకుల తాండ గ్రామంలో షెడ్యూల్ తెగల వారితో, వైవాహిక వయస్సు రాకుండానే, బాల్య వివాహాలు చేసుకుంటున్నారని, ఎవరు కూడా చదువుకునే వయస్సులో పెళ్లిళ్లు చేసుకోవద్దని, పూర్తిగా శారీరక ఎదుగుదల కానిదే పెండ్లి చేసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు మానసిక ఎదుగుదల లేకుండా, పూర్తిగా అనారోగ్యంతో ఉంటారని వారి కుటుంబంలో వైవాహిక జీవితములో అన్యోన్యత ఉండదని, సంసారం బాధలను తట్టుకునే శక్తి వారి కుండదని, 18 సంవత్సరాల లోపు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని, చదువుకునే వయసులో చదువుకోవాలని, భవిష్యత్తు మంచి ప్రయోజకులుగా ఉండాలని, అంగీకారంతో పెళ్లి చేసుకోవాలని, తెలిసి తెలియని వయసులో ప్రేమలో పెళ్లిళ్లని, యువతి యువకులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని తెలియజేశారు. బాల్య వివాహాలను గ్రామాలలో తెలిసి తెలియని వాళ్ళు చాలామంది ఉన్నారని, వాళ్లకి ఈ వివాహాల గురించి తెలియని వారు చాలామంది ఉన్నారని, శ్రీ శిశు సంక్షేమ శాఖ వారు, వైద్య శాఖ వారు మరియు గిరిజన సంక్షేమ శాఖ వారు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ద్వారా అనేక కార్యక్రమాలు పిల్లలకి చేయూతనందిస్తున్నారని వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, అటు తల్లిదండ్రులకి మరియు గురువులకు మన దేశం గర్వించేదగ్గ విధంగా ఎదగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ మెజిస్ట్రేట్ జడ్జిగారు ఆర్ మురళి, రెవెన్యూ డిపార్ట్మెంట్ డిప్యూటీ తాసిల్దార్, తలుపుల పిహెచ్సి డాక్టర్ ఎం చంద్రశేఖర్ నాయక్, ఎంఈఓ పద్మావతి, ఎంపీడీవో, శ్రీనివాసు, ఏపీఎస్ఆర్టీసీ బాబు నాయక్, న్యాయవాది సౌకతలి, సిడిపిఓ రాజమ్మ, పోస్టల్ డిపార్ట్మెంట్ వారు జనార్ధన, పీలేరు అర్బన్ ఎస్ఐ, అంగన్వాడి వర్కర్స్, అంగన్వాడి సూపర్వైజర్, తలుపుల నర్సులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అటల్ ల్యాబ్‌ను సందర్శించిన జిల్లా సైన్స్ అధికారి

విశాలాంధ్ర-సంబేపల్లె:మండల పరిధిలోని నారాయణరెడ్డివల్లి గ్రామం యర్రగుంట్ల సమీపంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని అటల్ టింకరింగ్ ప్రయోగశాలను జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి శనివారం సందర్శించారు. ప్రయోగశాల పనితీరును, విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను, రికార్డులను పరిశీలించారు. నేషనల్ ఇన్నోవేషన్ మిషన్ వారు కేటాయించిన నిధుల వినియోగ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్ లో విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకొని 3డి ప్రింటింగ్ మిషన్ ను ఉపయోగించి మోడల్స్ రూపొందించారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని అటల్ ల్యాబ్ లలో విద్యార్థులకు కోడింగ్ నైపుణ్యాలను పెంపొందింప చేయాలన్నారు. అటల్ క్యాలండర్ ను అనుసరించి ప్రతి వారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రతి నెల అటల్ ల్యాబ్ ల పనితీరును సమీక్షించి లీప్ యాప్ లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థుడైన కమీషనర్‌పై నిందలు వేయడం తగదు :తెదేపా కౌన్సిలర్లు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సమర్ధుడైన కమీషనర్‌పై నిందలు వేయడం తగదని కౌన్సిలర్‌లు మురళీధర్ రెడ్డి, మహమ్మద్ గౌస్‌లు పేర్కొన్నారు. నెహ్రూ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం మున్సిపల్ కమీషనర్‌గా పని చేస్తున్న రవిచంద్రా రెడ్డికి అపార అనుభవం ఉందన్నారు. మున్సిపల్ కమీషనర్‌గా, కార్పొరేషన్‌లో పని చేసిన అనుభవం ఉందన్నారు. ఆయన నిబంధనల మేరకు ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారని, అవినీతికి అవకాశం ఇవ్వడం లేదన్నారు. ఇలా చేస్తున్నందుకే వైసీపీ నాయకులు సహించలేక కమీషనర్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో పనిచేసిన కమీషనర్ రాధా, రమణయ్యలకు ఎలాంటి అనుభవం లేకపోయినా కమీషనర్లుగా తీసుకొచ్చి మీరు అవినీతి, అక్రమాలకు పాల్పడలేదా అని ప్రశ్నించారు. కూరగాయల మార్కెట్టు ఒక కోటి 60లక్షల 80వేలకు వేలంపాటలో దక్కించుకుంటే మీ ఆదాయానికి గండి పడుతుందని టెండర్ క్యాన్సల్ చేయలేదా వైసీపీ హయాంలో ఎగ్జిబిషన్‌ను దక్కించుకొని వైసీపీ నాయకుల బకాయిలు వసూలు చేయండని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంపై, కమీషనర్‌పై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో నూరి, పోసా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గణేష్ నిమజ్జనం- ట్రాఫిక్ తో వాహనాల మళ్లింపు : పీలేరు అర్బన్ సీఐ. యుగేందర్

విశాలాంధ్ర- పీలేరు: నేడు గణేష్ నిమజ్జనం సందర్బంగా ట్రాఫిక్ తో పలు వాహనాల మళ్లింపు ఉంటుందని పీలేరు అర్బన్ సీఐ. యుగేందర్ తెలిపారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతు ఆదివారం పీలేరు పట్టణంలో జరగబోయే గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా కొంత ట్రాఫిక్ మార్పులు చేయడం జరుగుతుందని అన్నారు, ప్రజలందరూ గమనించి పోలీసు వారికి సహకరించాలని కోరారు. 1) మదనపల్లి వైపు నుండి ఎటువంటి వాహనాలు పీలేరు పట్టణంలోకి మదనపల్లి పాత రోడ్డు కూడా అనుమతి లేదు, ఎవరైనా పట్టణంలోకి రావాలి అని అనుకుంటే కడప రోడ్డు అక్కడి నుండి నాలుగు రోడ్ల గుండా వారి యొక్క గమ్యస్థానం చేరుకోవచ్చునని అన్నారు. 2) అలాగే తిరుపతి నుండి మదనపల్లి వైపు వెళ్లే వాళ్లు పీలేరు బైపాస్ గుండా వెళ్ళవచ్చునని అన్నారు. 3) కడప నుండి చిత్తూరు వెళ్లే వారు బైపాస్ గుండా మరువ వడ్డేపల్లి, కోటపల్లి క్రాస్, ఫోర్ రోడ్స్ చేరుకొని తద్వారా చిత్తూరు వైపు వెళ్ళవచ్చు అలాగే చిత్తూరు నుండి వచ్చే వాహనాలు కూడా కోటపల్లి క్రాస్, మరవ వడ్డేపల్లి కడప సర్వీస్ రోడ్ ద్వారా కడప రోడ్ చేరుకొని కడప వైపు వెళ్ళవచ్చునని అన్నారు.ఆర్టీసీ బస్సులు మరియు ఇతర ఇతర ప్రైవేటు బస్సులు కూడా ఈ మార్గాన్ని అనుసరించవలెనని తెలిపారు.

5ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 8ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

విశాలాంధ్ర-వాల్మీకిపురం : పట్టణ సమీపంలోని పునుగుపల్లె వద్ద రెండు 5ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసి వాల్మీకిపురం పట్టణానికి విద్యుత్తు సరఫరా జరుగు తుంది. ఇటీవల పట్టణ పరిధిలో విద్యుత్తు సర్వీసులు అమాంతంగా పెరిగడంతో పాటు విద్యుత్తు లోడు సరిపోకపోవడంతో గత కొన్ని నెలలుగా పట్టణంలో లోఓల్టేజ్ సమస్య తలెత్తి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో 5ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్ స్థానంలో శనివారం ఉదయం 8 ఎంవీఏ కొత్త ట్రాన్స్ఫార్మర్న ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ ఇకపై పట్టణంలో లోఓల్టేజ్ సమస్య తలెత్తదని ఇకపై లోఓల్టేజ్లోని నిరంతరాయ విద్యుత్తు సరఫరా జరుగుతుందన్నారు. గతంలో విద్యుత్తు సరఫరాలో ప్రజలకు ఉన్న ఇబ్బం దులు ఇకపై ఉండవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లైన్మెన్ శేషాద్రిరెడ్డి, శ్రీపతి, విజయకుమార్, ట్రాన్స్కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భూసమస్యల పరిష్కారానికి సువర్ణఅవకాశం

విశాలాంధ్ర-బిట్రగుంట: జిల్లాలోని గిరిజనులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక సువర్ణ అవకాశాన్ని కల్పించిందని, జిల్లాకలెక్టర్ ఆనంద్ ఆదేశాలమేరకు ఈనెల 6వతేదీన అన్నిరెవెన్యూ డివిజనల్ కార్యాలయాలలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి వారి భూసమస్యలను తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లాసమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ భూమిరెడ్డి మల్లికార్జునరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారని, బోగోలు మండలతాసిల్దార్ సానా శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. అదేక్రమంలో సెప్టెంబర్ 1వతేదీన నాగులవరం, జక్కుపల్లి గూడూరు 2వతేదీన తాళ్లూరు, బోగోలు 3న కోవురుపల్లి, మంగమూరు 4న విశ్వనాథరావుపేట, ఏనుగులు బావి 5న బిట్రగుంట, సిద్ధవరంవెంకటేశ్వర పాలెం 6న జువ్వలదిన్నె, సిఆర్ పాలెం గిరిజనప్రాంతాలలో ఆరుసంవత్సరాలు వయసుఉన్న గిరిజన పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాల ఆధారంగా, 7సంవత్సరాలు దాటిన వారికి డోమినల్ ధ్రువీకరణ పత్రాలను సిద్ధంచేసి ఆధార్ నమోదుచేయించవలసిందిగా ఆయా శాఖలఅధికారులను ఆదేశించి ఉన్నందున, ఆయా గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలపరిషత్ అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం కోరారు.

యువకుడిపై హత్యయత్నం

విశాలాంధ్ర- కలువాయి:: యువకునిపై హత్యయత్నం చేసిన ఘటన మండల కేంద్రమైన కలువాయి నాయీబ్రాహ్మణ కాలనిలో చోటుచేసుకున్నది. వివరాలలోకి వెళ్తే కలువాయి నాయీబ్రాహ్మణ కాలనిలోని వినాయకుని మండపం వద్ద పూజ జరుగుతున్న సమయంలో అదే కాలనీలో ఉంటున్నటువంటి ఒకవ్యక్తి బైక్ పై అటుగా మితిమీరిన వేగంతో అటుగా రావడంతో అక్కడ ఉన్నటువంటి ఒకవ్యక్తి అతనిని ఎందుకలా వేగంగా వస్తున్నావు చిన్నపిల్లలు ఉన్నారని వెళ్ళమని అడగగా అతనితో గొడవకుదిగి ఉదయంలోపు నిన్ను చంపేస్తానని బెదిరించి అక్కడినుండి వెళ్లిపోయి. శనివారం తెల్లవారుజామున మరో ఇద్దరని తీసుకునివచ్చి ఆ వ్యక్తి అనుకోని అక్కడ నిద్రిస్తున్న వేరే వ్యక్తి పై కారంపొడి చల్లి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అది గమనించిన చుట్టూ ప్రక్కలవారు అడ్డుకుని పోలీస్ లకు పిర్యాదు చేయగా అక్కడికి వచ్చిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకోగా హత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి మాత్రం పోలీస్ లతో గొడవకి దిగి పారిపోయాడు.

లక్ష్మీనరసింహ స్వామి వార్ల కళ్యాణ వైభోగం

విశాలాంధ్ర -రాపూరు : రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రం నందు శనివారం సందర్భంగా ఉదయం గం.4 లకు శ్రీ స్వామి వారికి అభిషేకం, గం. 10. 30. కి శ్రీ వార్లకు కళ్యాణోత్సవం, నేత్రానందంగా దర్శించుకున్న భక్తు లు మరియు సాయంత్రం గం.5.30. లకు చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మి సమేత నరసింహ స్వామి వారి కి తిరుచ్చి పల్లకి సేవ ప్రధానార్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో మం గళ వాయిద్య, గిరిజనుల వాయిద్య నడుమ సహస్ర దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించడమైనది ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సం ఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శిం చి తీర్థ ప్రసాదములు స్వీకరించినా రు.భక్తులకు ఎటువంటి లోటుపా ట్లు లేకుండా క్యూలైన్ల ఏర్పాట్లు, మంచి నీరు సరఫరా,అన్నదానం మొదలగు కార్యక్రమాలు ఉప కమి షనర్ మరియు కార్యనిర్వాహణాధి కారి పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించడం జరి గింది.

మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి

ఈ శనివారం ఆదాయం రూ10,91,095రూ

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండలంలోని అయ్యవారిపల్లి పంచాయతీ లో కొలువుదీరి ఉన్న మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామిదేవస్థానంను దర్శించుకొనుటకు రాష్ట్రం నలుమూలలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. ఈ శనివారం భక్తుల ద్వారా వివిధ రూపాలలో దేవస్థానం నకు వచ్చిన ఆదాయం 10,91,095రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఉపకమిషనర్, ఆలయకార్యనిర్వాహనాదికారిఎస్. చంద్రశేఖర్ తెలిపారు. అష్టోత్రం ద్వారా రూ8,900 రూ,కుంకుమార్చన ద్వారా రూ22,000లు , తలనీలాలద్వారా రూ47,325 లు,వాహన పూజలద్వారా రూ. 4,660లు , ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,10,900లు , స్థల పురాణం ద్వారా రూ. 280 లు,రూముఅద్దెలు ద్వారా రూ. 30,990లు , కవర్లు ద్వారా రూ. 7,400లు, లడ్డూ ప్రసాదం ద్వారా రూ1,79,820లు,అన్న ప్రసాదముద్వారా రూ 4,45,820రూపాయలు, ఇతర విరాళాలు.రూ, 30,000లు, వివాహముల ద్వారా రూ 3,000లు,మొత్తం 10,91,095రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఉపకమీషనర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్. చంద్రశేఖర్ తెలిపారు.

గ్యాస్ లీక్ తో ఇబ్బంది పడుతున్నాం

విశాలాంధ్ర-ముత్తుకూరు: కృష్ణపట్నం పోర్టు పోర్టులో నౌకల నుండి గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లకు పిట్టర్ గ్యాస్ నింపే సమయంలో అప్పుడప్పుడు గ్యాస్ను బయటకు వదులుతున్నారని అందువల్ల ఆ గ్యాస్ లీక్ అయిన సమయంలో గ్రామంలోని ప్రజలకు కొంతమేర శ్వాస సంబంధిత సమస్య ఎదురవుతుందని ఈ సమస్యను పరిష్కరించాలంటూ కృష్ణపట్నం, గోపాలపురం గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ఆనంద్ కు తెలిపారు. తమ గ్రామం కృష్ణపట్నం పోర్టు లో జరుగుతున్న ఎగుమతులు దిగుమతులు కారణంగా తమ గ్రామాలు కాలుష్యంతో నిండిపోయాయని, తమ గ్రామాన్ని సురక్షిత ప్రాంతాన్ని తరలించాలంటూ ఇటీవల గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ఆనందం కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. దీంతో కలెక్టర్ ఆనంద్ శనివారం గోపాలపురం గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణపట్నం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం, శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర ఆలయాల చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, కృష్ణపట్నం పంచాయతీ నాయకులు రాగల శివకృష్ణ, గోపాలపురం నాయకులు పగడాల సతీష్ లు జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు లో జరుగుతున్న బొగ్గు దిగుమతులు, ట్విట్టర్ గ్యాస్ కారణంగా తమ గ్రామాలు కాలుష్యంతో పూర్తిగా నిండిపోయాయన్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా ఏ ఇంటి మీద చూసిన ఇంటిలోని పాత్రలపైన సైతం బొగ్గు పడిపోతుందని, అలాగే ఫిట్టర్ గ్యాస్ నౌకనుండి స్టాక్ పాయింట్ లో ఉన్న ట్యాంకర్లకు నింపే సమయంలో అప్పుడప్పుడు గ్యాస్ లీక్ అవుతుందని ఆ సమయంలో శ్వాస పీల్చుకోవడం కొంత ఇబ్బందికరంగా మారుతోందని అందువల్ల తమ గ్రామాల అనేకమంది పలు ఆరోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారని తమ గ్రామాన్ని కూడా సురక్షిత ప్రాంతాన్ని తరలించి తమని ఆదుకోవాలని కలెక్టర్ ను కోరారు. అలాగే సరి హద్దు రాయి కూడా మార్చాల్సి ఉందని ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నాగ సంతోషి అనూష, తాసిల్దార్ స్వప్న, ఎంపీడీవో నాగమణి, అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్లకు వెంటనే జీతాలు ఇవ్వాలని

ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో కు వినతి

విశాలాంధ్ర-ఆత్మకూరు:: ఇమామ్,మోజాన్లకు 9 నెలల నుండి జీతాలు ఇవ్వక పోవడంతో వాళ్లు ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులను ఆవాజ్ కమిటీ జిల్లా నేత యజ్దాని ఆర్డీవో కు వివరించారు.ఇమామ్,మోజాన్లకు ఇవ్వాల్సిన జీతాలు వెంటనే ఇవ్వాలంటూ, ఇప్పుడు ఉండే ఖర్చులరీత్యా వాళ్ళ గౌరవ వేతనాన్ని పెంచాలంటూ ఆయన కోరారు. ఈ విషయం గురించి ఆర్డీవో స్పందించి మీ సమస్యను ప్రభుత్వానికి నివేదించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా నాయకులు యస్దాని సల్మాన్,ఖాజా రహమతుల్లా. ఆషికిన్, ఫారుక్, ఆదిల్, నసీర్, హర్షద్,ఆత్మకూరు ప్రాంత మసీదుల ఇమామ్, మౌజన్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

విశాలాంధ్ర- కలువాయి : కలువాయి మండలంలోని కోటూరు పల్లి గ్రామంలో సర్వే నెంబర్ 80 నందు గల ప్రభుత్వ భూమిని స్థానిక ఉండే కొందరు దర్జాగా కబ్జా చేశారు. గ్రామస్తులు శుక్రవారం వినాయక చవితి ఉత్సవాల్లో ఉండగా అర్ధరాత్రిలో ప్రభుత్వ భూమిని చదును చేసి , దున్నించారు . నేషనల్ హైవే కి దగ్గరగా ఉండటంతో ఇటీవల భూ కబ్జాలు మండలంలో అధికమయ్యాయి. అడ్డగించాల్సిన రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు తాసిల్దార్ కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కానీ భూ ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన నాయకులు

విశాలాంధ్ర -వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండలంలోని చుండిగ్రామం లో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ని చుండి తెలుగుదేశం మండల పార్టీ యువనాయకులు చెరువుపల్లి సాంబయ్య లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా చెరువుపల్లి సాంబయ్య మాట్లాడుతూ స్మార్ట్ కార్డులతో రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందవచ్చని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రేషన్ ప్రక్రియలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీని కలిసిన జడ్పిటిసి

విశాలాంధ్ర- కలువాయి : తిరుపతి పార్లమెంట్ సభ్యులు యం గురుమూర్తిని శనివారం తిరుపతిలోని ఆయన నివాసంలో కలువాయి జడ్పిటిసి సభ్యులు బులగాకుల అనిల్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు మండలంలో జరుగుతున్న రాజకీయ స్థితిగతులు పై చర్చించారు ఆయనతోపాటు నరసింహారెడ్డి ఉన్నారు.

మహిళలచే వినాయక చవితి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: మూలపేట కోనేటి మిట్టలో పూర్తి గా మహిళ ల ఆధ్వర్యంలో వేడుకలునిర్వ హించారు. మహిళలందరు కలుసుకొని ఒక కార్యక్రమం చేపట్టాలని అనుకున్నారు.తక్షణమే ఆచరించారునెల్లూరు నగరంలోని మూలపేట కోనేటి మిట్ట లొ ఈ సారి వినాయక చవితి వేడుకలు తాము నిర్వహిద్దామని అనుకోని అందరి సహకారం తో తమ వీధిలో వినాయక మండపాని ఏర్పాటు చేశారు.బుధవారం తాత్కాలిక వినాయక స్వామి విగ్రహం నెలకొల్పేరు. సాయంత్రం పూజా కార్యక్రమం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీ ధర్ రెడ్డి నిర్వహించారు.చవితి వేడుకలో భాగంగా గురువారం మధ్యాహ్నం రావి విజయలక్ష్మి అన్నదానం చేశారు..ఈ కార్యక్రమంలొఉత్సవ నిర్వాహకులు నాగలక్ష్మి,ఇంటి శ్రీదేవి. విజయలక్ష్మి తాతి రెడ్డి లక్ష్మి ప్రియ. సునీత సింగ్. శ్రావ్య. తదితరులు పాల్గొన్నారు..

సుబ్రమణ్యం మృతి కెసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలం లోని తేగచర్ల గ్రామం లోని యానాది కులం కు చెందిన కందుకూరు సుబ్రమణ్యం గుళికలు మింగి మృతి చెందాడని ఏఎస్ ఐ వెంకటే శ్వరావు తెలిపారు. టెస్టు వివరాలు తెలియజెస్తూ.తేగచర్ల లో పుణ్య లక్ష్మీనారాయణ తోటలో కాపాలవుంటున్న తండ్రి కందుకూ రు పోలయ్య కొడుకు కందుకూరు సుబ్రమణ్యం(20) శుక్రవారం తండ్రి కొడుకులు డబ్బుల విషయం లో డబ్బులు ఇవ్వలేదని కొడుకు సుబ్రమణ్యం గుళికలు మింగి మధ్యాహ్నం 3.30 గం లకు గుళి కలు మింగానని చెప్పడంతో రాపూరు ప్రభుత్వ ఆసుపత్రి తీసు కొని రాగా ప్రథమ చికిత్స అందించి మేరుగైన చికిత్స కోరకు గూడూరుకు రెఫర్ చెయడం తో గూడూరు పోవు మార్గ మధ్యలో మృతి చెందడంతో గూడూరు ప్రభుత్వ హస్పేట ల్ లో శవపరీక్ష లు నిర్వహించడం జరిగిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ వెంకటే శ్వర రావు తెలిపారు.

నిమజ్జనానికి తరలిన విఘ్నేశ్వరుడు

విశాలాంధ్ర - ముద్దనూరు : వినాయక చవితి పండుగ పురస్కరించుకుని వాడ వాడలా కొలువుదీరిన వినాయక విగ్రహాలను శనివారం మండపాల కమిటీ నిర్వాహకులు ఘనంగా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఎక్కడివి అక్కడే పూర్తి చేయాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు వీలైనంత త్వరలో పూర్తి చేయాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మనోజ్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. శనివారం ఉదయం పర్యటనలో భాగంగా 50వ డివిజన్‌లోని చిన్నమాచుపల్లి ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మమేకమై క్లాప్ ఆటో ప్రతిరోజు వస్తుందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కాలువల పరిశుభ్రత, రోడ్ల శుభ్రతపై సమీక్ష చేసి సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై ఆయన అక్కడికక్కడే అధికారులతో చర్చించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడుకూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

విశాలాంధ్ర- యర్రగుంట్ల : విద్యుత్ వినియోగదారులు నేడు (ఆదివారం) కూడా తమ విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చునని ఏపీ ఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రియదర్శన్ రెడ్డి తెలిపారు. ఆగస్టు మాసం చివరి రోజు31 వ తేదీ అయినందున విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్ ద్వారా తమ విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చునని, విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా సంస్థ అభివృద్ధికి బాసటగా నిలవాలని ప్రియదర్శన్ రెడ్డి కోరారు.

గంగమ్మ ఒడికి గణనాథులు

శోభాయాత్రలో యువత ఉత్సాహం

విశాలాంధ్ర-గాలివీడు : వినాయక చవితి సందర్భంగా విశేష పూజలందుకున్న గణేశుడు శనివారం గంగ ఒడికి చేరాడు.మండల వ్యాప్తంగా నాలుగవ రోజు వినాయక నిమజ్జన వేడుకలు కోలాహలంగా జరిగాయి. జై గణేశా.. జైజై గణేశా నినాదాలు,మేళతాళాలతో గణనాథుడి నిమజ్జన కార్యక్రమం సంబరంగా సాగింది.పలు విగ్రహాల వద్ద లడ్డు వేలంపాటలో లడ్డును దక్కించుకోవడం కోసం ప్రజలు ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు. సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించి మండపాల నుంచి వినాయకుడిని కదిలించారు. నిమజ్జన కార్యక్రమానికి ఆటంకం లేకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోగా,యువత నృత్యాలు చేస్తూ కోలాటాలు వేస్తూ వినాయకుడిని గంగ ఒడికి సాగనంపారు.గాలివీడు పట్టణంలో భారీ వినాయక విగ్రహాలు వెళ్తుండగా శోభా యాత్ర యువతీ యువకుల ఉత్సాహం, కేరింతలతో సందడి నెలకొంది.గ్రామీణ ప్రాంతాల్లో వంకలు,చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

క్లస్టర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఇటీవల ఉపాధ్యాయ బదిలీలలో సర్ప్లస్ గా ఉన్నటువంటి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ గణితం మరియు భాషా పండితులకు ఉపాధ్యాయులకు క్లస్టర్ టీచర్లు గా నియమించబడిన వారికి డీఎస్సీ 2025 నియామకాల కంటే ముందుగా క్లస్టర్ టీచర్లకు రెగ్యులర్ ప్లేస్ లను కేటాయించాలని కడప జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్ ను ఎస్.టీ.యు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ భాష, రాష్ట్ర సంయుక్త అధ్యక్షులు కే సురేష్ బాబు రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్.టీ.యు నాయకులు మాట్లాడుతూ జీవో నెంబర్ 22 మేరకు జూన్ నెలలో ముగిసిన ఉపాధ్యాయ బదిలీల సందర్భంగా 117 జీవో రద్దు కావడం వలన మిగులు ఉపాధ్యాయులుగా ఉన్నటువంటి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, గణిత మరియు భాష పండిత ఉపాధ్యాయులను క్లస్టర్ టీచర్లుగా నియమించిన సంగతిని గుర్తు చేస్తూ బదిలీల అనంతరం జూన్ మరియు జులై నెలలలో ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు పదవి విరమణ చెందారు. అలాగే ఈనెల ఆగస్టు 31వ తేదీన కూడా నాటికి కూడా మరి కొంతమంది పదవీ విరమణ చెందుతున్నారు అలాగే డీఎస్సీ 2025 ద్వారా ఈ సబ్జెక్టులకు సంబంధించి ఖాళీలను గుర్తించి ఉన్నారు. ఈ నేపథ్యంలో డీఎస్సీ 2025 నియామకాల కంటే ముందుగా జూన్,జూలై,ఆగస్టు నెలల్లో పదవీ విరమణ స్థానాలను మరియు డీఎస్సీ 2025లో చూపించనున్న ఖాళీలలో ఈ క్లస్టర్ టీచర్లకు రెగ్యులర్ స్థానాలను కేటాయించాలని తద్వారా వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హబీబుల్లా, మహబూబ్ బాషా కడప నగర అధ్యక్షుడు సాదిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బీసీ నూతన అధ్యక్షుడిగా చెన్నకృష్ణ

విశాలాంధ్ర - సుండుపల్లి : మండల కురబసంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా గంతల చెన్నకృష్ణ కు రాజంపేట అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గం జనసేనపార్టీ నాయకులు రామ శ్రీనివాస్ జనసేన శ్రేణులతో కలిసి ఘనంగా సన్మానించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనునిత్యం బడుగు బలహీన వర్గాల వారికి ముఖ్యంగా బీసీలు రాజకీయంగా ఉన్నతస్థాయికి ఎదగాలని అదేవిధంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కేవలం బీసీలను ఓట్లు వరకే పరిమితం చెయ్యకుండా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ద్వారా వారి సంక్షేమ అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఆకాంక్షించారు.

ప్రభుత్వ ఉద్యోగి పదవి విరమణ

విశాలాంధ్ర -బ్రహ్మంగారిమఠం : మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి మల్లికార్జున రావు పదవి విరమణ పొందడంతో ఆయనను ఘనంగా సన్మానించారు. అధికారులు రాజకీయ నేతలు సన్మానించారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు వీరనారాయణరెడ్డి, మండలాభివృద్ధి అధికారులు ఇన్చార్జ్ ఎంపీడీవో వీర కిషోర్, అట్లూరు ఎంపీడీవో, వెంగముని రెడ్డి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, చెన్నుపల్లి సుబ్బారెడ్డి సోమిరెడ్డి పల్లె సాకార పరపతి సంఘం చైర్మన్, యల్లటూరి సాంబశివరెడ్డి కానాల మల్లికార్జునరెడ్డి వివిధ శాఖ అధికారులు పదవి విరమణ పొందిన అధికారికి ఘన సన్మానం ఈ సందర్భంగా వారు నేతలు అధికారులు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవి విరమణ తప్పనిసరి ఉంటుందని మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నుండి సూపరింటెంట్ వరకు తను పనిచేసే ఈరోజు పదవి విరమణ పొందడం కొంతమంది బాధాకరమేఅయితే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు పదవి విరమణ తప్పనిసరి ఉంటుందని అయితే మల్లికార్జున ప్రజలు నుండి అధికారుల వరకు అందరి వాడిగా ప్రజల్లో మంచి పేరును అటు అధికారులు రాజకీయ నేతలు అందరు మనోభావాలు దెబ్బ తినకుండా పనిచేసిన అధికారి పదవి విరమణ పొందడం బాధాకరమైన ఆయనకు కుటుంబ సభ్యులు మంచిగా చూసుకొని బ్రహ్మంగారి ఆశీస్సులతో ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, పుల్లయ్య వెంకటేశ్వర్లు పంచాయితీరాజ్ శాఖ మురళీమోహన్ రెడ్డి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, ఉపాధి ఏపీవో, హరికృష్ణ వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు, పెద్ద ఎత్తు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో టిడిపి నాయకులు

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని రేకులకుంట పంచాయతీలో ఉన్న డిఅగ్రహారం గ్రామంలో విగ్నేశ్వర స్వామి వద్ద తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కానాల, మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు కార్యక్రమం చేపట్టి అనంతరం విఘ్నేశ్వర స్వామి వద్ద కులమతాలకు అతీతంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా గ్రామంలో వారి సిద్ధి వినాయక స్వామి పండుగను వైభవంగా నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే ప్రతిరోజుప్రత్యేక పూజలు అభిషేకాలు పలు సాంస్కృతి కార్యక్రమాలు చేపట్టి అన్నదాన కార్యక్రమాలను నిర్వయించడం జరిగిందని మా గ్రామానికి విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులతో పాటు రైతులు పేద ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామని కూటమి ప్రభుత్వంతో దినదినం గ్రామాల అభివృద్ధి జరగాలని శాసనసభ్యులు సహాయ సహకారాలతో మండలం అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామని శాసనసభ్యులకు విగ్నేశ్వరుని స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఆయనకు ఆయన కుటుంబానికి ఉండాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలుపాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని నిమజ్జనానికి తరలింపు

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండలంలోని వివిధ గ్రామాలలో మూడు రోజులు పాటు ప్రత్యేక పూజలు అందుకొని నిమజ్జనానికి బ్రహ్మ సాగర్ కు భారీ ఊరేగింపుతో బాణాసంచా మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో కోలాటాలతో బ్రహ్మ సాగర్ తరలించడంతో నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బ్రహ్మంగారిమఠం ఎస్సై, శివప్రసాద్ ప్రత్యేకంగా బందోబస్తుని బ్రహ్మ సాగర్ వద్ద ఏర్పాట్లను చేసి చిన్న పిల్లలకు అనుమతి లేకుండా సాగర్ వద్ద గట్టు బందోబస్తుని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. స్థానిక ఐదు రోడ్ల కూడలి వద్ద భక్తులకు ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా నిమజ్జనానికి తరలించే విగ్రహాలను ప్రత్యేకంగా చూపించారు. పలు గ్రామాలలో ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాలు ఏర్పాట్లను విఘ్నేశ్వరుని కమిటీ ఏర్పాట్లను ఏర్పాట్లు చేశారు.

కరువు సీమను కోనసీమగా మారుస్తున్నాం :టీడీపీ ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి

విశాలాంధ్ర-పెద్దమండ్యం : నియోజకవర్గంలోని హంద్రీ-నీవా కాలువల ద్వారా 53 చెరువులకు నీరు నింపి నియోజకవర్గ చెరువులను పుష్కలంగా రైతులకు వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వం ఎంతో చొరవతో ఇచ్చిన మాట ప్రకారం హంద్రీనీవా నీటిని విడుదల చేసి రైతులకు అండగా నిలుస్తామని అలాగే కరువు సీమను కోన సీమగా మారుస్తున్నామని దాసరిపల్లి జయచంద్రరెడ్డి అన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో హంద్రీ-నీవా కాలువల ద్వారా రెండు విడతల్లో 53 చెరువులకు నీటిని నింపుతున్నామని టీడీపీ ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి అన్నారు. శనివారం కూటమి నాయకులు, అధికారులతో కలసి కురబలకోట మండలం దొమ్మన్నభావి వద్ద హంద్రీ-నీవా కాలువ నీటికి జలహారతి ఇచ్చారు. కృష్ణా జలాలను హంద్రీ-నీవా కాలువలతో కరువు మండలాలో పారించి కోనసీమగా మారుస్తున్న ఘనత సీఎం నారా చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. తంబ ళ్లపల్లె నియోజకవర్గం పాడిపం టలతో సస్యశ్యామలం అవుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో టిడిసి కార్య కర్తలు పాల్గొన్నారు.

ఐజేయూలో ఇరువురికి చోటు!

జేసీఎన్‌రామాంజనేయరెడ్డి, సియాసత్ ప్రతినిధి సర్ధార్‌కు అవకాశం

విశాలాంధ్ర-కడప : ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ)లో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఇరువురికి చోటు లభించింది. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ కడపకు చెందిన జేసీఎన్ ప్రతినిధి రామాంజనేయరెడ్డి, సియాసత్ ప్రతినిధి సర్ధార్‌కు అవకాశం కల్పిస్తూ నిర్ణయించింది. ఐజేయూ మెంబర్లు కోసం జిల్లా కమిటీ సిఫార్సు చేసిన ప్రతిపాదనలు అంగీకరిస్తూ రాష్ట్ర కమీటీ ఆమోదించి, ఐజేయూ మెంబర్లుగా రామాంజనేయరెడ్డి, సర్ధార్‌ను నియమిస్తూ శనివారం అధికారికంగా నిర్ణయించినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణా రెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. వీరి ఎన్నిక పట్ల ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట రెడ్డి, రాష్ట్ర నాయకులు రామసుబ్బా రెడ్డి, జిల్లా జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.

రహదారిపై మురుగునీరు

తొలగింపు చర్యలు చేపట్టని పంచాయతీ సెక్రెటరీ

దోమల వ్యాప్తితో ప్రజలకు ఇక్కట్లు

విశాలాంధ్ర- సిద్ధవటం : రహదారిపై డ్రైనేజీ మురుగునీరు స్తంభించడంతో దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని గ్రామస్తులు తెలిపారు, మండలంలోని, గొల్లపల్లి, గ్రామంలోని ఆర్ అండ్ బి రోడ్డుపై డ్రైనేజీ మురుగునీరు స్తంభించడంతో దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని గ్రామస్తులు తెలిపారు, పలుమార్లు మురుగునీరు తొలగింపు చేపట్టాలని పారిశుధ్య కార్మికులకు చెప్పిన పట్టించుకోలేదని గ్రామపంచాయతీ సెక్రటరీ విధులకు ఎప్పుడొస్తాడో తెలియని పరిస్థితి అని మురుగునీరు తొలగింపు చేపట్టి విష జ్వరాలు సోకకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయమై మండల అభివృద్ధి అధికారి ఫణి రాజకుమారి వివరణ కోరగా రహదారిపై మురుగనీరు తొలగింపు చేపట్టాలని గ్రామ పంచాయతీ సెక్రెటరీ వెంకటేష్ కు ఆదేశిస్తామని గ్రామంలో ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే కఠినమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

విశాలాంధ్ర- సిద్ధవటం : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్టీ కాలనీ వాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి తీసు కోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. మండల కేంద్రమైన సిద్ధవటం లోని చెంచులక్ష్మి ఎస్టీ కాలనీలో శనివారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది రామదాసు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమని ఆడవారికి 18 సం, మగ వారికి 21 సం, పూర్తి అయ్యాక వివాహాలు చేయాలని వివాహ వయసు కాకముందే బాల్య వివాహాలు చేపడితే పిసిఎంఎ చట్టం 2006 ప్రకారం 2 సం, జైలు శిక్ష మరియు జరిమానా విధిస్తారని ఎవరైనా చట్ట విరుద్ధంగా బాల్యవివాహాలు చేపడితే,1098 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి తెలపాలని అన్నారు. ఎవరికైనా ఎస్టీ కాలనీ వాసులకు బర్త్, మ్యారేజ్ సర్టిఫికెట్ల కోసం నోటరీ ఉచితంగా చేస్తామని తెలిపారు. ప్రతి గ్రామం లో బాల్య వివాహాలు పైన అవగాహన కల్పిస్తూ ఉన్నామని ఎవరైనా స్కూలుకు వెళ్లకుండా పిల్లలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వారికి మంచి ప్రవర్తన కల్పించి స్కూలుకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, శ్రీనివాసులు, శివ యానాది కాలనీవాసులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

విశాలాంధ్ర-కడప వైవీయూ : ప్రముఖ సాహితీవేత్త, చరిత్రకాలు, భాషా పరిశోధకులు 'కళాసరస్వతి' డా.తిరుమల రామచంద్ర కుమార్తె శ్రీమతి ఆముక్తమాల్యద చెన్నైలో తన నివాసంలోని విలువైన పుస్తకాలను శనివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు, సిబ్బందిలకు అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన విలువైన గ్రంథాల్లో ప్రత్యేకించి తిరుమల రామచంద్ర రచనలు ఉండడం విశేషమన్నారు. వాటిలో బృహదారణ్యకం, మనవి మాటలు, అహంభో అభివాదయే, తిరుమల రామచంద్ర జీవితం-సాహిత్యం, ప్రాకృత వ్మాయంలో రామకథ లాంటి పుస్తకాలున్నాయన్నారు. వీటితోపాటు స్వయంభూ: మరో 11 కథలు, ఇసుక రేణువులు, ఇదిగో లోకానికి ఇది నా లేఖ, శాసనాలు సామాజిక, సాంస్కృతిక, చరిత్ర, పార్వతీ పరిణయం, శ్రీరమణ

పుస్తకాలతోపాటు ఆంగ్ల నవలలు, కథలు కూడా ఉన్నాయన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరించిన తిరుమల రామచంద్ర, అనంతలక్ష్మిల కుమార్తె ఆముక్తమాల్యదను యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి, డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

వినాయక లడ్డు దక్కించుకున్న ధ్వజారెడ్డి అభిమాని

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండలంలోని ఎస్ ఉప్పరపల్లిలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మూడు రోజులుగా ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.వినాయక మండపం వద్ద లడ్డు వేలం పాట పెట్టారు.వేలం పాటలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు,మండల పరిషత్ ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి అబిమాని ఉప్పరపల్లి మహేష్ 20,000 వేల రూపాయలకు దక్కించుకున్నాడు. మొదట ధ్వజారెడ్డి కి శాలువా కప్పి అబిమానాన్ని చాటుకున్నారు. ద్వజారెడ్డి మహెష్ ను అభినందించారు. ఆయన అద్వర్యంలో ప్రజల అందరికీ వినాయక లడ్డు పంచిపెట్టి మహేష్ భక్తిని, అభిమానాన్ని చాటుకున్నారు.

పులివెందుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: బిజెపి నేతలు స్పష్టీకరణ

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల ప్రాంత అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని బిజెపి నాయకులు అనిల్ కుమార్, శివ, తరుణ్, బాబావలి, వాజ్ పాయి లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బ్రష్టు పట్టిన పాలనను తిరిగి గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా పులివెందులలో యూజీడి, తాగునీరు, విద్యుత్ మరికొన్ని ప్రధాన రంగాలపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. ఈ విషయమై ఇటీవలే కూటమినేత బీటెక్ రవి ఆయన సతీమణి పులివెందుల జడ్పిటిసి మారెడ్డి లతా రెడ్డిలు కలెక్టర్ కు అన్ని విషయాలు వివరించారన్నారు. ఇక తమ పార్టీ సీనియర్ నేత వంగల శశి భూషణ్ రెడ్డిని రాష్ట్రస్థాయిలో అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల ఇక పులివెందులలో అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. పులివెందులలో ఇటీవల కొన్ని సమస్యలను తమ నాయకుడు తిరుపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వాటికి పరిష్కారం కూడా లభించిందన్నారు. కూటమి ప్రభుత్వ హయాములో పులివెందుల అంచలంచెలుగా అభివృద్ధి చెందుతుందని ఈ విషయమై ప్రతిపక్ష పార్టీలు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు.

చెరపకురా చెడేవు అనేరీతిలో కూటమి ప్రభుత్వం తీరు

వైఎస్ఆర్సిపి డాక్టర్ విభాగం అధ్యక్షులు డాక్టర్ నాగార్జున రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ విశాఖపట్నంలో పార్టీల బలోపేతం చేసేందుకే లోకల్ సమ్మిట్ జరుగుతుంది తప్ప,ఏమి ఒరిగింది లేదని, చెరపకురా చెడేవు అనే రీతిలో కూటం ప్రభుత్వం తీరు ఉండడం కేవలం ప్రతిపక్ష పార్టీ వైస్సార్సీపి పై విషప్రచారాన్ని చేశారని వైస్సార్సీపి డాక్టర్ విభాగం అధ్యక్షులు డాక్టర్ నాగార్జున రెడ్డి మండిపడ్డారు. శనివారం వైస్సా ర్సీపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రుషి కొండపై నిర్మించిన వరల్డ్ క్లాస్ బిల్డింగ్ ప్రభుత్వ వివిధ కార్యకలాపాలకు వినియోగించేందుకు మాజి ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి కట్టిస్తే అందు లో సమ్మిట్ పెట్టుకొన్నారన్నారు. అందులో ఒక రూములో ఫాల్స్ సీలింగ్ కావాలనే ఉద్దేశ్య పూర్వకంగా డ్యామేజ్ చేసి కిందపడేలా చేసి ప్రజలలో జగన్ మోహన్ రెడ్డి గారి మంచి పాలన మీద బురద చల్లే ప్రయత్నం , ఆ ప్రయత్నం కూడా సరిగా నిర్వహించలేక చెరపకు రా చెడేవు అనేరీతిలో ఉంది అని మండి పడ్డారు. ఒక పాల్ సీలింగ్ పడి ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు వైఎస్ఆర్సిపి పై బురదజల్లే కార్యక్రమం చేయడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి టి యు సి నగర అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.